31వ వసంతంలోకి
# చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా
బుధవారం 22 ఏప్రిల్ 2026
పేజీలు : 8

### ఓటరు జాబితా సవరణ ప్రక్రియను
# పారదర్శకంగా నిర్వహించాలి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 21 :** ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం పురోగతిపై జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బీఎల్ఎలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ఓటరు జాబి తా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించాలని అధికా రులకు సూచించారు. కొత్తగా అర్హత పొందిన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో చేర్చడం, మరణించిన వారు మరియు డూప్లికేట్ ఎంట్రీ లను -2లో

### కేసీఆర్ బహిరంగ సభ
# తెలంగాణ ఉద్యమాన్ని తలపించింది



- **వాస్తవాలు మాట్లాడితే కేసీఆర్‌ను ఉరి తీస్తావా**
- **కేసీఆర్‌ను దోషిగా చేయడం కోసమే మేడిగడ్డ మరమ్మత్తుల్లో జాప్యం**
- **మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 21 :** కేసిఆర్ బహిరంగ సభ తెలంగాణ ఉద్యమాన్ని తలపించిందని, వాస్తవాలు మాట్లాడితే కేసీఆర్ ను ఉరి తీస్తావా అని, కేసీఆర్ ను దోషిగా చేయడం కోసమే మేడిగడ్డ మరమ్మత్తుల్లో జాప్యం చేస్తున్నారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ నావులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ జగిత్యాలలో కేసిఆర్ బహిరంగ సభతెలంగాణ ఉద్యమాన్ని తలపించిందని, రెండుసార్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా దేశంలో తెలంగాణను మొదటి స్థానంలో నిలిపారన్నారు. కేసీఆర్ రైతులకు రైతు బంధు ఇచ్చి ఆదుకుంటే రేవంత్ రెడ్డి మూడు పంటలకు రైతు భరోసా ఎగ్గొట్టారని, పంటల బీమా పథకం ఊసే లేదని, భూమి లేని వారికి ప్రోత్సాహకం ఇస్తామని మోసం చేశారన్నారు. కళ్యాణలక్ష్మికి తులం బంగారం ఇస్తామని చెప్పి అమలు చేయడంలేదని, పెళ్లి నాటికి ఇవ్వాల్సినది ప్రసూతి నాటికి కూడా ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. కేసిఆర్ కిట్ పేరు నచ్చకపోతే ఇందిరమ్మ పేరుతో అమలు చేయాలని, రాష్ట్రం తన వంతు వాటా ఫీజు రీయింబర్సెంట్ నిధులు ఇవ్వకపోవడంతో కేంద్ర నిధులు వెనక్కి మళ్లాయని, రేవంత్ రెడ్డి పోవాలి.. కేసీఆర్ రావాలి.. అని కోరుకున్నామే తప్పా రేవంత్ రెడ్డి కీడు కోరలేదన్నారు. ప్రజలు పాలన మార్పు కోరుతున్నారని, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారంటే అది కేసీఆర్ పుణ్యమేనన్నారు. వాస్తవాలు మాట్లాడితే కేసీఆర్ ను ఉరి తీస్తావా, మేడిగడ్డి కుంగి పోయి 30 నెలలు అయిందని, రేవంత్ రెడ్డి ఇప్పుడు నిద్ర లేచినట్టు నటిస్తున్నారని, మరమ్మతులు చేస్తే కేవలం 400 కోట్లు అవుతాయని, ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చి ఏడాది గడుస్తున్న ఇప్పటికీ మర్మతులు చేపట్టలేదన్నారు. కేసీఆర్ ను దోషిగా చేయడం కోసం జాప్యం చేస్తున్నారని, తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మిస్తామని ఎన్నికల ప్రణాళికలో పేర్కొని ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రానికి సుమారు 1000 టిఎంసిల నీరు లభిస్తుందని కాళేశ్వరం నిర్మించారని, వాతావరణం అనుకూలించకపోతే ఉత్తర తెలంగాణ ఎడారిగా మారితే రేవంత్ రెడ్డి బాధ్యుడు కాదా అని నిలదీశారు. ఆనాటి టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని అస్థిర పరచాలని రేవంత్ రెడ్డి ఓటు కు నోటు తెరపైకి తీసుకు వచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రానికి పట్టిన శని, పీడ రేవంత్ రెడ్డి తొలగిపోవాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. తన ప్రజా జీవితం తెరిచిన పుస్తకమని, 1981లో పంచాయతీ సమితి అధ్యక్షుడిగా ఎన్నికైతే 13 మంది కాంగ్రెస్ లో చేరితే తాను ఒక్కడినే పార్టీ మారలేదని, నాదెండ్ల భాస్కర్ రావు ను తొలగించడం సరికాదని ఇందిరా గాంధీ సైతం అండగా నిలిచారని గుర్తు చేశారు. 1984 లో పార్టీ ఫిరాయింపు చట్టమే లేదని, శాసనసభ రద్దైన తర్వాత ప్రజస్వామికంగా పార్టీ మారానని, రాజ్యాంగం ఉల్లంఘించి కాదన్నారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ..రాజకీయ జీవితం కొనసాగిందని, 2019లో శాసన మండలి లో ఒంటరిగా పోరాటం చేశానని, అప్పుడు తనకు పార్టీ ఫిరాయింపు వర్తించదని, అయినా పార్టీ మారలేదన్నారు. పదవులు తాను ఏనాడు ఆశించలేదని, తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా ద్వితీయ శ్రేణి నాయకత్వం ఎదిగింది జగిత్యాలలోనేనన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ను ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చారని, సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ రోజు ఒకసారి రాజ్యాంగంలో పదో షెడ్యూలు చదువుకోవాలని హితవు పలికారు. అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సంజయ్ సీఎం రేవంత్ రెడ్డి తో కలిసి ప్రయాణం చేస్తున్నానని అంటున్నారని, తెలంగాణ అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి బీజేపీలో కలువాలన్నారు.

### రాహుల్ గాంధీ స్థానం కోసం
# రేవంత్ రెడ్డి తాపత్రయం

- **దక్షిణాదికి అన్యాయమంటూ గగ్గోలు**
- **వెనుక అసలు కుట్ర ఇదే జమిలి ఎన్నికలొస్తే బీజేపీ గెలుస్తుందనే భయం రేవంత్‌కు పట్టుకుంది**
- **రేవంత్ రెడ్డి, స్టాలిన్‌లపై మండిపడ్డ కేంద్ర మంత్రి బండి సంజయ్**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 21 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్థానా న్ని ఆక్రమించాలని తాపత్రయపడుతు న్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యా నించారు. అందులో బాగంగానే డీలిమి టేషన్ బిల్లుతో దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని గగ్గోలు పెడుతున్నారని అన్నారు. జమిలి ఎన్నికలొస్తే తెలంగాణ లోనూ బీజేపీ విజయం తథ్యమని రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందన్నారు. ఈరోజు కరీంనగర్ లో మీడియాతో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుపై బండి సంజయ్ మీడియాతో మాట్లాడు తూ రేవంత్ రెడ్డి, స్టాలిన్ లపై మండిప డ్డారు. ఏమన్నారంటే...డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను అడ్డుకుని ఏదో గొప్ప పని చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ప్రజలంతా రేవంత్ ను ఛీదరించుకుంటున్నారనే సం గతి మర్చిపోయారు. కనీసం ఇంటెలి జెన్స్ నుండి సమాచారం తెప్పించుకుంటే బాగుండేది. ఇవేవీ లేకుండా రాహుల్ గాంధీ స్థానంలో రేవంత్ రెడ్డి కూర్చో వాలని తాపత్రయపడుతున్నారు. ఎందు కంటే రాహుల్ గాంధీని ప్రజలు లీడర్ గా అంగీకరించడం లేదు. ఆ స్థానంలోకి రావాలని తహతహలాడుతున్నారు. మహిళా బిల్లును అడ్డుకుని రేవంత్ రెడ్డి, స్టాలిన్ సహా విపక్షాలు చాలా పెద్ద తప్పు చేశాయి. కాంగ్రెస్, ఎస్పీ, డీఎంకే, ఎన్సీపీ పార్టీల దృష్టిలో మహిళలంటే -2లో

# కేసీఆర్ చావును ఎవరు కోరుకోలేదు

- **రేవంత్ రెడ్డి సర్కార్ ఎందుకు పోవాలి ?**
- **ముఖ్యమంత్రిని ఏకవచనంతో మాట్లాడడం తగదు**
- **కరీంనగర్ మీడియా సమావేశంలో మంత్రి అడ్లూరి**



**చురకలు ప్రతినిధి కరీంనగర్, ఏప్రిల్ 21 :** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చావును ఎవరు కోరుకోలేదని కేసీఆర్ గౌరవం ఇచ్చి తెలంగాణలో ఏర్పాడిన ప్రజా ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని అనేక సందర్భాల్లో విజ్ఞప్తి చేయడం జరిగిందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కరీంనగర్ నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ తో పాటు పలువురు నేతలతో కలిసి ఏర్పాటుచేసిన పత్రిక విలేకరుల సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాలలో బీఆర్ఎస్ పార్టీ ఈనెల 20వ తేదీన నిర్వహించిన సభలో మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అనేక సంవత్సరాలుగా పోరాటం చేసిన ఎస్సీ వర్గీకరణ బిల్లు సందర్భంగా అసెంబ్లీకి వచ్చి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరినప్పుడు అసెంబ్లీకి రాలేదని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బీసీలకు 42 శాతం బిల్లు విషయంలో సైతం కేసీఆర్ గారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని గౌరవంగా ఆహ్వానించారని -2లో

## పున్నేలులో విజయోత్సాహం

**-సర్పంచ్ ఉస్మాన్ అలీ, అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు జిల్లా దయాకర్‌లకు ఘన సన్మానం**



**చురకలు ప్రతినిధి,హనుమకొండ, ఏప్రిల్ 21 :** హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలో రాజకీయ, సామాజిక చైతన్యం వెల్లివిరిసింది. గ్రామాభివృద్ధే ధ్యేయంగా భారీ మెజారిటీతో సర్పంచ్‌గా విజయం సాధించిన ఎస్.కె. ఉస్మాన్ అలీ, పున్నేలు గ్రామ అంబేద్కర్ యూత్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా దయాకర్ లను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకులు జిల్లా సతీష్, జిల్లా సంపత్ లు వారిని శాలువాలతో సత్కరించి, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో నిరంతరం ముందుంటూ, గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడంలో నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు జిల్లా దయాకర్ ప్రత్యేక సహకారం అందిస్తూ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులందరి సహకారంతో, సమిష్టి కృషితో పున్నేలు అభివృద్ధికి బాటలు వేస్తామని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా యువతను ఐక్యం చేస్తూ ముందుకు సాగుతామని నూతనంగా ఎన్నికైన అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు ధీమా వ్యక్తం చేశారు. ఈ సన్మాన కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగింది.

## జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ నియామకం



**చురకలు విలేఖరి వీణవంక ఏప్రిల్ 21 :** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ బలోపేతమే లక్ష్యంగా పార్టీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. వీణవంక మండలం,కిష్టంపేట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు వావిలీల సత్యనారాయణ ని జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ వర్గాలు ఉత్తర్వులు జారీ చేశాయి. పార్టీ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన పార్టీ నాయకత్వం ఈ బాధ్యతను అప్పగించినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ కార్యకర్తలను సమన్వయం చేసుకుని ముందుకు సాగుతానన్నారు.

## కేసీఆర్ చావును ఎవరు కోరుకోలేదు

**మొదటి పేజీ తరువాయి..**అయినప్పటికీ కేసీఆర్ అసెంబ్లీకి రాలేదని మంత్రి అడ్లూరి అన్నారు. రాష్ట్రం 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకొని ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని అయితే 2023 ఎన్నికల ఫలితాలకు ముందే బీఆర్ఎస్ నాయకులు మూడోసారి అధికారంలోకి వస్తామని ముందస్తు విజయోత్సవాలు నిర్వహించుకున్నారని మంత్రి అన్నారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యం శంకర్, మాజీ ఎంపీపీ పడితపెల్లి కిషన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దుబ్బాసి బుచ్చయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పురుమళ్ళ మనోహర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు రోమాల రమేష్, బైరిశెట్టి సంపత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల గడిబురుజుల స్థలాల రక్షణ కోసం నిరసన దీక్ష

**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఏప్రిల్ 21 :** కోరుట్ల పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద గడిబురుజుల (గ్రామకంఠ/ఆబాది) ఖాళీ స్థలాల పరిరక్షణ కోసం అఖిలపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్ష ప్రారంభ మైంది. ఈ స్థలాల్లో జరిగినట్లు ఆరోపణలున్న భూ అక్రమాలు అవినీతి చర్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గడిబురుజుల చారిత్రాత్మక ప్రాధాన్యతను కాపాడాలని, కోనేరును సంరక్షించాలని కోరారు. అలాగే మైసమ్మ తల్లికి పూర్తి స్థాయి దేవాలయం నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆ ప్రాంతంలో కూరగాయల మార్కెట్ పార్క్ ఏర్పాటు చేయాలని, ప్రతి సంవత్సరం జరిగే మహా శాసుర మర్దిని ఉత్సవాలకు సంబంధించిన స్థలాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు.

# రాహుల్ గాంధీ స్థానం కోసం...

**మొదటి పేజీ తరువాయి....**
సోనియా, ప్రియాంకగాంధీ, డింపుల్ యాదవ్, కనిమొళి, సుప్రియా సూలే మా త్రమే. వాళ్లకు పదవులు, సీట్లు ఇస్తే మహిళలందరికీ న్యాయం జరిగినట్లేనని అనుకుంటున్నారు. అందుకే సాధారణ మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తానంటే అడ్డుకోవడం లేదు. ఎందుకంటే సాధారణ మహిళలకు చట్టసభల్లోకి వస్తే... వారసత్వ కుటుంబ పార్టీల పునాదులు కదిలిపోతాయనే భయం పట్టుకుంది. అందుకే అడుగడుగునా అడ్డుకుంటున్నారు. దేశంలో 52 కోట్ల జనాభా ఉన్నప్పుడు 543 పార్లమెంట్ సీట్లు ఉండాలని నిర్ణయించారు. నేటికీ అదే కొనసాగుతోంది. దేశ జనాభా 140 కోట్లు దాటిన నేపథ్యంలో ఎంపీ సీట్ల సంఖ్యను 816 ఎంపీ సీట్లు చేయాలని మోదీ నిర్ణయించారు. జనాభా లెక్కలతో సీట్లు కేటాయిస్తే దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని మోదీ గ్రహించి ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెంచి ఏ రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాలని బిల్లును పెట్టారు. దీంతోపాటు అస్తవ్యస్తంగా ఉన్న పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు క్రమబద్ధీకరించాలని నిర్ణయించి పార్లమెంట్ లో డీలిమిటేషన్ బిల్లు పెడితే... అడ్డుకుని రేవంత్, స్టాలిన్ సహా కుటుంబ పార్టీలు దక్షిణాదికి తీరని అన్యాయం చేశారు. పార్లమెంట్ లో గంట సేపు సమయమిస్తే... ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెంచుతూ డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెడతామని అమిత్ షా చెప్పారు. తద్వారా దక్షిణాదికి న్యాయం చేస్తామని చెబితే... అడ్డుకున్నది ఎవరు కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ, టీఎంసీ, ఎన్సీపీ పార్టీలే కదా..

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 21 :** ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం పురోగతిపై జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బీఎల్ఎలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కొత్తగా అర్హత పొందిన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో చేర్చడం, మరణించిన వారు మరియు డూప్లికేట్ ఎంట్రీ లను తొలగించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, యువ ఓటర్లను ప్రోత్సహించాలని సూచించారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి, అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చేలా కృషి చేయాలని జిల్లాలో 100శాతం ఓటరు నమోదు కావాలని సంబంధిత అధికారులను, బిఎల్వోలను ఆదేశించారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, బిఎల్వోలు, జిపివోలు పాల్గొన్నారు.

# ఈత సరదా విషాదంగా మారవద్దు

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 21 :** వేసవికాలంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో పిల్లలు, యువకులు ఈత నేర్చుకోవడానికి చెరువులు, కాలువల వద్దకు ఈతకు వెళ్లే అవకాశం ఉన్నందున ఈ క్రమంలో ప్రమాదాలు జరిగి నీటిలో మునిగి ప్రాణ నష్టం జరుగుతుండటం వలన అందరూ ఈ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈత సరదా విషాదంగా మారకూడదని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈత రానివారు బావులు, చెరువుల



వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని ఈతను నేర్చుకునే వారు వారి తల్లిదండ్రుల సమక్షంలో నేర్చుకోవా లని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువుల వద్దకు కాలువల వద్దకు కుంటలు వద్దకు వెళ్ల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగినట్లయితే పిల్లల ప్రాణానికి ప్రమాద మని ఈ విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకొని పిల్లలను యొక్క కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు.

**మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు...**

జిల్లా వ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్ లపై ప్రత్యేక శ్రద్ధ ఉంచడం జరిగినదని తల్లిదండ్రుల, మైనర్లకు వాహనం ఇవ్వకూడదని, వాహనం ఇచ్చినచో వారు తెలిసి తెలియని డ్రైవింగ్ తో వాహనం నడపటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నా యని, దానితో వారికి మరియు ఎదుటి వ్యక్తులకు ప్రమాదం జరగటం వల్ల రెండు కుటుంబాలు నష్ట పోతున్నాయని, మైనర్ లకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ మైనర్ కు వాహనం ఇచ్చి ఏదైనా ప్రమాదం జరిగిన లేదా మైనర్ డ్రైవింగ్ చేస్తూ వాహనంతో పట్టుబడిన వాహన యజమాని పై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

# కాంగ్రెస్ సర్కార్‌కు 24 గంటల డేడ్ లైన్..!?

**గంగాడి కృష్ణారెడ్డి వ్యాఖ్యలు**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 21 :** హుజూరాబాద్ రూరల్ మండలం సిర్సపల్లి శివారులో డంపింగ్ యార్డు రద్దు విషయంలో ప్రభుత్వం నుంచి 24 గంటల్లో స్పష్టమైన ప్రకటన రాకపోతే , ప్రభుత్వాన్ని నిద్రపోనివ్వమని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఘాటుగా హెచ్చరించారు. మంగళవారం రోజున హుజూరాబాద్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గంగాడి కృష్ణారెడ్డి పై వ్యాఖ్యలు చేస్తూ మాట్లాడారు. డంపింగ్ యార్డ్ రద్దు నిర్ణయంపై పై రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి 24 గంటల డెడ్ లైన్ విధిస్తున్నామని , ఈలోగా కాంగ్రెస్ ప్రభుత్వం డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని , స్పష్టమైన ప్రకటన చేయకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. హుజూరాబాద్ జనాలు డంపింగ్ యార్డ్ వద్దని నెల రోజులుగా గగ్గోలు పెడుతున్న ప్రభుత్వానికి కనిపించడం లేదా..? వినిపించడం లేదా..? ఆయన ప్రశ్నించారు. హుజూరాబాద్ చుట్టూ పక్కల గ్రామాల ప్రజలంతా నిద్రాహారాలు మాని , రోడ్డెక్కిన, నిరసనలు, ఆందోళనలు చేపట్టిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సరికాదన్నారు. డంపింగ్ యార్డ్ వద్దని, రద్దు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో నిరాహారదీక్షలు, ఆందోళన కార్యక్రమాలు నెల రోజులుగా చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించక పోవడానికి కారణం ఏంటని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రజల మనోభావాలను అర్థం చేసుకోకుండా, గుర్తించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం, ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయంతో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ప్రజావ్యతిరేక తనుమూటగట్టుకుందన్నారు . రాష్ట్ర ప్రభుత్వమొండి వైఖరి ప్రదర్శిస్తూ హుజూరాబాద్ ప్రజలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు విషయంలో బి ఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూ ప్రజలను గోసపెట్టే చర్యలకు పూనుకున్నారన్నారు.

# దేశభక్తి ముసుగులో కాషాయ వ్యూహం

## -గ్రామాల్లో శివాజీ విగ్రహాల రాజకీయ కథ



(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్)

తెలంగాణతో సహా దేశవ్యాప్తంగా గ్రామ గ్రామాన శివాజీ మహారాజు విగ్రహాలు ఇటీవల అత్యధిక సంఖ్యలో వెలుస్తున్న దృశ్యం కేవలం ఒక సాంస్కృతిక ఉద్యమం కాదు. అది ఒక లోతైన రాజకీయ-సామాజిక మార్పిడి. హిందూ ధర్మ సమాజ రక్షణ అనే నేపథ్యంలో దేశభక్తిని తన లక్ష్యంగా చూపించి, వాస్తవంలో హిందూ కాషాయికరణను గ్రామ స్థాయిలో నాటుతున్న వ్యూహాత్మక ప్రయత్నం. గతంలో స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల విగ్రహాలు ఏకైక గ్రామీణ చిహ్నాలుగా ఉండేవి. ఇప్పుడు ఆ స్థానాన్ని శివాజీ ఆక్రమిస్తున్నారు. ఈ మార్పు యొక్క లోతును అర్థం చేసుకోవాలంటే, దాని వెనుక ఉన్న ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలు, బీజేపీ రాజకీయ లాభాలు, సినిమా సాధనం వంటి అంశాలను సమగ్రంగా విశ్లేషించాలి. గత కాలంలో గ్రామాల్లో భగత్ సింగ్, జవహర్‌లాల్ నెహ్రూ, డా. బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్, ఇందిరా గాంధీ, స్వామి వివేకానందల విగ్రహాలు మాత్రమే ప్రతిష్ఠితమవుతుండేవి. ఇవి భారత స్వాతంత్ర్య పోరాటం, సమాజ సంస్కరణ, లౌకికత్వం, ఐక్యత వంటి విలువలను ప్రతిబింబించేవి. ఈ విగ్రహాలు ఏ ఒక్క మతం లేదా సంప్రదాయానికి పరిమితం కాకుండా, మొత్తం జాతిని ఒక్కటి చేసే చిహ్నాలుగా నిలిచాయి. కానీ ఇప్పుడు ఆ స్థానాన్ని శివాజీ విగ్రహాలు ఆక్రమించడం యాదృచ్ఛికం కాదు. ఇది ఆర్ఎస్ఎస్ సంస్థలు గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న చురుకైన కార్యక్రమాలు, హిందూ ధార్మిక మహాసభలతో ముడిపడి ఉంది. ప్రతి గ్రామంలో అట్టహాసంగా వేడుకలు, ఉత్సవాలు నిర్వహించడం ద్వారా ఈ విగ్రహాలను కేవలం చారిత్రక వ్యక్తి కాకుండా, "హిందూ సమాజ రక్షకుడు"గా స్థాపించడం జరుగుతోంది. ఈ ప్రక్రియకు ఇటీవలి కాలంలో ఒక బలమైన సాంస్కృతిక ఆయుధం లభించింది -- 'చావా' చిత్రం. గత ఏడాది విడుదలైన ఈ సినిమా శివాజీ తనయుడు సంభాజీ మహారాజు యొక్క వీరత్వం, ధైర్యం, హిందూ సమాజ రక్షణను కేంద్రంగా చిత్రీకరించి భారతీయప్రజల మనసుల్లో గాఢంగా నాటుకుపోయింది. కానీ ఇది ఒక్కటే కాదు. 'కాశ్మీర్ ఫైల్స్' (2022), 'ది కేరళ స్టోరీ' (2023) వంటి చిత్రాలు కూడా ఇదేవ్యూహంలో భాగమయ్యాయి. కాశ్మీర్ ఫైల్స్ కాశ్మీరీ పండిట్ల బాధలను గ్రాఫిక్‌గా చూపి ముస్లింలను సాధారణీ కరించి హింసాత్మకులు, ద్రోహులుగా చిత్రీకరించింది. కేరళ స్టోరీ 'లవ్ జిహాద్' అనే వివాదాస్పద థీరీని ఆధారం చేసుకొని ముస్లిం యువకులను హిందూ-క్రిస్టియన్ అమ్మాయిలను ఆకర్షించి ఉగ్రవాదంలోకి నెట్టేవారిగా చూపి సామాజిక ధ్రువీకరణను రెచ్చగొట్టింది. ఈ చిత్రాలన్నింటినీ భారతీయ జనతా పార్టీ సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. సినిమా ద్వారా సృష్టించిన భావోద్వేగాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవడం బీజేపీ వ్యూహంలో కొత్త కాదు. కానీ ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఈ చిత్రాలు దేశభక్తిని కాకుండా, హిందూ ధర్మ రక్షణను ప్రధానథీమ్‌గా ఎత్తి చూపి బీజేపీ-ఆర్ఎస్ఎస్ కలయిక ద్వారా జరుగుతున్న "కాషాయీకరణ" ప్రక్రియకు బలం చేకూరుస్తున్నాయి. ఈ వ్యూహం యొక్క లోతైన అర్థం ఏమిటి? ఇది రాజకీయ లబ్ధి కోసం చేసే లెక్కలు. గ్రామ స్థాయిలో హిందూ ఐక్యతను సృష్టించడం ద్వారా బీజేపీ తన ఓటు బ్యాంకును విస్తరించుకోవాలని చూస్తోంది. దేశభక్తి అనే ఉదాత్తమైన భావనను హిందూ ధర్మ సంరక్షణతో ముడిపెట్టడం ద్వారా, మతపరమైన ధ్రువీకరణను ప్రోత్సహిస్తుంది. ఇది భారతదేశం యొక్క లౌకిక స్వభావాన్ని, సమగ్ర జాతీయతను క్రమంగా కుంచించుతుంది. గతంలో జాతీయ నాయకుల విగ్రహాలు స్వాతంత్ర్య సమరం, సామాజిక న్యాయం, మత నిరపేక్షత వంటివిలువలను ప్రతిబింబించాయి. వాటిని భర్తీ చేస్తున్న శివాజీ విగ్రహాలు మాత్రం ఒక నిర్దిష్ట చారిత్రక సందర్భంలోని మరాఠా యోధుడిని, మొఘల్ సామ్రాజ్యంతో (అంటే ముస్లిం పాలనతో) జరిగిన సంఘర్షణను హిందూ-ముస్లిం దృష్టికోణంలో చూపించడం ద్వారా సమాజంలో ఇప్పటికే ఉన్న విభేదాలను మరింత లోతుగా చేస్తాయి. ఆర్ఎస్ఎస్ దీర్ఘకాలిక సాంస్కృతిక ప్రాజెక్ట్ ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామాల్లో ధార్మిక మహాసభలు, కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా హిందూ సమాజాన్ని ఒక రాజకీయ బ్లాక్‌గా మార్చడం జరుగుతోంది. బీజేపీ దీన్ని ఎన్నికల లాభంగా మార్చుకోవడం సహజం. కానీ ఈ ప్రక్రియ దేశం మొత్తం సామాజిక సామరస్యానికి, లౌకిక రాజ్యాంగ విలువలకు ఎంత పెద్ద సవాలుగా మారుతుందో గుర్తించాలి. జాతీయ నాయకుల విగ్రహాలు ఏకత్వాన్ని నిర్మించాయి. శివాజీ విగ్రహాలు మాత్రం ఒక నిర్దిష్ట ధార్మిక గుర్తింపును బలపరుస్తాయి. ఇది భారతదేశం యొక్క వైవిధ్య భరితమైన సమాజాన్ని ఒక ఏకపక్ష హిందూ దృక్పథంతో చూడడానికి దారి తీస్తుంది. ఈ నేపథ్యంలో ఒక విషయం స్పష్టం-దేశభక్తి నిజమైనది కావాలంటే అది అన్ని వర్గాలను, అన్ని మతాలను కలుపుకొని ఉండాలి. హిందూ కాషాయీకరణ ద్వారా రాజకీయ లాభాలు పొందడం స్వల్పకాలిక విజయం కావచ్చు. కానీ దీర్ఘకాలికంగా దేశ ఐక్యత, సామాజిక స్థిరత్వానికి హాని చేస్తుంది. గ్రామాల్లో శివాజీ విగ్రహాలు ఎంత భారీగా వెలుస్తున్నాయో, అంతగా మనం ఆలోచించాలి- ఇది నిజంగా దేశాన్ని బలపరుస్తుందా, లేక ఒక నిర్దిష్ట రాజకీయ ఎజెండాను గ్రామ స్థాయి నుంచి బలపరుస్తుందా? ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడం భారతీయ ప్రజాస్వామ్యం యొక్క భవిష్యత్తుకు కీలకం.



## కరెంటు ట్రిప్పు కాకుండా ఉండేందుకు ఎర్తులకు నీరు అందిస్తాం

-తిమ్మాపుర్ గ్రామ సర్పంచ్ బస శ్రావణ్




**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఏప్రిల్ (21) :** కరెంటు ట్రిప్పు కాకుండా ఉండేందుకు, విద్యుత్ కొతలు తోలగించెందుకు ఎర్తుల రక్షణకోసం గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీరు అందిస్తామని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం తిమ్మపుర్ గ్రామ సర్పంచ్ బస శ్రావణ్ అన్నారు. మంగళవారం గ్రామనికి విధ్యుత్ సరఫరా అయ్యె ట్రాన్స్ఫార్మర్స్, 15 కెవి బుడ్డిల వద్ద ఉన్న ఎర్తుల వద్ద ట్యాంకర్ ద్వారా నిటిని అందించారు. ఈసందర్భంగా శ్రావణ్ మాట్లాడుతు ప్రజలకు విద్యుత్ ద్వారా ఎలాంటి ఆటంకం రాకుండా ఉండేందుకు విద్యుత్ సిబ్బందికి గ్రామపంచాయతీ సిబ్బంది ఎప్పుడు సహకరిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో లైన్ మైన్ తంగళ్ళపెల్లి శ్యాం,ఎ ఎల్ ఎం చింతకింది రవి,గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వేములకుర్తి అంగన్వాడీ కేంద్రాలలో గ్రాడ్యుయేషన్ డే



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఏప్రిల్ (21) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని వేములకుర్తి గ్రామంలోని అంగన్వాడి కేంద్రలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఎల్కే జీ యూకే జీ పూర్తి చేసుకునీ ఒకటవ తరగతికి వెళ్లే విధ్యర్దులకు ప్రీస్కూల్ సర్టిఫికెట్ ప్రోగ్రెస్ కార్డు అందచేశారు. అంగన్వాడీ టిచర్లు కుమారం మాదవి,పుప్పాల రమ్యలు మాట్లాడుతూ చిన్నపిల్లలను ప్రవేట్ స్కూల్‌కి పంపకుండా అంగన్వాడీ కేంద్రాలకి పంపించాలని,అంగన్వాడీలో ఆటపాట కథల ద్వారా విద్య నేర్చుకుంటారని,వారి యొక్క మెదడు అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తరి రామనుజం, పంచాయతీ కార్యదర్శి గుడురు శ్రీకాంత్,పాఠశాల ప్రదానోపాధ్యయురాలు గంగమణి,ఉపాధ్యాయురాలు హర్షశ్రీ, ఎంఎల్ హెచ్ పి రమ్య,ఎఎన్ ఎం సుజాత ,ఆశలు బాగ్య,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలి



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఏప్రిల్ (21) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో తమ విధ్యర్దులను చదించాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు అన్నారు. మంగళవారం మండలం లోని ఫకీర్ కొండాపూర్ గ్రామంలో ప్రదానోపాధ్యయులు కోదండపాణి ,భరత్ కుమార్ కలిసి గ్రామానికి ఏడవ తరగతి విద్యార్థి విద్యార్థులను తల్లిదండ్రులను కలిసి ఎనిమిదో తరగతికి వేములకుర్తి పాఠశాలకు అడ్మిషన్ తీసుకోవాలని కరపత్రాల పంపిణీ చేస్తు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట రమేష్, ప్రదానోపాధ్యయులు రేణుక ,ఉపాధ్యాయులు రేష్మ, నైనిక ,నవీన్,సింగని మారుతి, శ్రీనివాస్, దీప తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపిడిఓ



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఏప్రిల్ (21) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రం లో ఉపాధి హామీ పనులను మంగళవారం ఇబ్రహింపట్నం ఎంపీడీవో వోదెల రామకృష్ణ పరిశీలించారు. కులిలు చేపడుతున్న బౌండరీ ట్రెంచ్ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు పనులను కోలతల ప్రకారం నాణ్యతతో చేయ్యలని సూచించారు. జాబ్ కార్డు ఉన్న కూలీలు అందరు హాజరై పనులను వేగవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ అభివృద్ధికి ఉపయోగపడే విధంగా పనులు సక్రమంగా చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## సాయి జీనియస్ హై స్కూల్‌లో ఘనంగా ప్రీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఏప్రిల్,21 :** సాయి జీనియస్ హై స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో చదువులపై ఆసక్తి పెంపొందించడం మాత్రమే కాకుండా వారిలో సృజనాత్మకతను అభివృద్ధి చేయడమే లక్ష్యమని ప్రిన్సిపాల్ చౌకి రమేష్ తెలిపారు. ప్రీ-ప్రైమరీ నుండి ప్రైమరీ స్థాయికి ప్రవేశిస్తున్న చిన్నారుల కు ఇది ఒక ప్రత్యేకమైన సందర్భంగా ఈ వేడుకలను నిర్వహించారు. ఈ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో చిన్నారులు గ్రాడ్యుయేషన్ గౌన్లు, టోపీలు ధరించి ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. తల్లిదండ్రుల సమక్షంలో సర్టిఫికెట్లు అందుకోవడం వారికి మరింత ఆనందాన్ని కలిగించింది. కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమం చిన్నారుల జీవితంలో మరపురాని జ్ఞాపకంగా నిలిచింది.

# వైభవంగా శంకర జయంతి వేడుకలు

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**

ధర్మపురిలో ఆదిశంకర భగవత్పాదులు జయంతి ఉత్సవ వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. శ్రీశారదా మాత, శంకరాచార్య మందిరంలో ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు.జగద్గురు శ్రీ ఆది శంకరాచార్య జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అనుబంధ దేవాలయం అయిన శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో గల శ్రీ ఆదిశంకరాచార్యుల వారికి,శారదాదేవికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం,అష్టోత్తరం పూజ ,మన్యసూక్తం,దుర్గా సూక్తం, పంచోపనిషత్‌లతో అభిషేకం,హారతి మంత్రపుష్పం కార్యక్రమములు అత్యంత వైభవంగా నిర్వహించబడినవి.దేవస్థానం వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ,స్థానిక వేదపండితులు, కాసర్ల వంశీ కృష్ణ,నాటంభట్ల ప్రశాంత్, కషోజ్జల శేఖర్,సూపరింటెండెంట్ కిరణ్,సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్,అర్చకులు ద్యావల్ల విశ్వనాథ శర్మ,నంబి అరుణ్,సాయికుమార్ అధిక



సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.సిబ్బంది కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రధాన దేవాలయంలో పంచసూక్తంలతో అభిషేకం,హారతి,మంత్రపుష్పం కార్యక్రమాలను సాంప్రదాయ రీతిలో వైభవంగా నిర్వహించారు.వేదపండితులు తాడూరు బాల కిష్టయ్య శర్మ,బలరాం శర్మ,పెండ్యాల శంకర్ శర్మ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంభి శ్రీనివాసాచార్యులు,సూపరింటెండెంట్ కిరణ్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ ,అర్చకులు చక్రపాణి కిరణ్ కుమార్ , అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**ధర్మపురిలో నగర సంకీర్తనం**

మసకబారి పోతున్న హైందవ ధర్మాన్ని పునరుజ్జీవింప చేసి, వేదాలలో, ఉపని షత్తులలో, భగవద్గీతలో ఉన్నవాటి ఉటంకించి, అద్వైత మతాన్ని స్థాపించిన ఆది శంకరుల జీవితం అందరికీ ఆదర్శమని శ్రీగాయత్రి నిత్యాన్నసత్రం సంఘం మాజీ అధ్యక్షులు మధ్వాచారి రాం కిషన్ ఉద్ఘాటించారు.మంగళవారం ధర్మపురి క్షేత్రంలో బ్రాహ్మణ నిత్యాన్న సత్రం ఆధ్వర్యంలో శంకర భగవత్పాదులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాంకిషన్ ప్రవచిస్తూ,భారతావనిలో నాలువైపులా తూర్పున జగన్నాథంలో గోవర్ధన మఠం,పడమట ద్వారకలో శారదామఠం,ఉత్తరాన కేదారంలో జ్యోతిర్మఠం,దక్షిణాన శృంగేరిలో శృంగగిరి మఠం నాలుగు మఠాలను స్థాపించారని వివరించారు.ఈ సందర్భంగా శంకర జయంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు.సంస్థ కార్యదర్శి అంబరీషా చార్య,ఇందారపు బండయ్య ఆధ్వర్యంలో...తాడూరి బాలకిష్టయ్య, బలరామ శర్మ,పెండ్యాల శంకర శర్మ, పెద్దంభట్ల మోహన్ రావు,ప్రకాష్, కాకెర్ల దత్తాత్రి,ఇందారపు శంకర్,శ్రీనివాస్, కొరిడె నరహరి,విశ్వనాథం,శంకర్, మధ్వాచారి రాం కిషన్,గురుస్వామి పెండ్యాల బాలకృష్ణ శర్మ,కొరిడే శంకర్,కషోజ్జల రాజేశ్వర్ శర్మ,బొజ్జా దత్తాత్రి,కిష్టయ్య,శంకర్,ఇందారపు శంకర్,తాడూరి రఘునాథ్,గుండి రామనాథం,మధు శంకర్,అలువాల దత్తాత్రి,కొరిడె సత్తన్న,కొరిడె విశ్వనాథ శర్మ,బల్యపెల్లి లింగన్న,ఓజ్జల నరేందర్, గుడ్ల నరహరి,జనమంచి రాములు,బావి మురళి,ఓజ్జల పురుషోత్తం,ఇందారపు రాములు తదితరులు పాల్గొన్నారు.

**లైబ్రరీ చైర్మన్ దినేష్ కు సన్మానం**

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వంచే నియామింప బడి,పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గాయత్రి బ్రాహ్మణ నిత్యాన్న సత్రం పక్షాన దినేష్ సంగన భట్లను ఘనంగా సన్మానించారు.

# పుట్టినరోజున కూడా సేవకే ప్రాధాన్యం ఇచ్చిన డాక్టర్ : రఘు

**చురకలు ప్రతినిధి కోరుట్ల ఏప్రిల్ 21:** సమాజానికి సేవ చేయడం ఒక బాధ్యతగా భావించే వ్యక్తులు అరుదుగా కనిపించే ఈ రోజుల్లో నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ రఘు తమ వినమ్రత నిస్వార్థ సేవా భావంతో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు వైద్య వృత్తిని చేపట్టిన ఆయన, కేవలం డాక్టర్‌గా మాత్రమే కాకుండా సమాజ సేవకుడిగా కూడా ప్రజల మనసుల్లో స్థానం సంపాదించారు.డాక్టర్ రఘు అనేక సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారు పేదలకు ఉచిత వైద్య




శిబిరాలు నిర్వహించడం అనాథాశ్రమాలకు సహాయం అందించడం అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు అండగా నిలవడం వంటి ఎన్నో సేవలను ఆయన నిరంతరం కొనసాగిస్తున్నారు సమాజ అభివృద్ధికి ఆరోగ్యం విద్య రెండు ప్రధాన స్తంభాలని ఆయన విశ్వసిస్తున్నారు.తమ పుట్టినరోజు సందర్భంగా కూడా వేడుకలకు ప్రాధాన్యం ఇవ్వకుండా సేవాకార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లారు కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్మీడియట్ టాపర్లకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు ఈ చర్య ద్వారా విద్యార్థుల కృషిని గుర్తించి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యం స్పష్టమవుతోంది.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొని డాక్టర్ రఘు సేవా స్ఫూర్తిని అభినందించారు ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణ పొందుతారని వారు అభిప్రాయపడ్డారు.

# ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న డాక్టర్ రఘు

## -బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు ఈటెల రాజేందర్ శుభాకాంక్షలు

**చురకలు ప్రతినిధి, కోరుట్ల, ఏప్రిల్ 21 :** సమాజానికి సేవ చేయడం ఒక బాధ్యతగా భావించే వ్యక్తులు అరుదుగా కనిపించే ఈ కాలంలో డా. రఘు తమ వినమ్రత నిస్వార్థ సేవా భావంతో ప్రత్యేకంగా నిలుస్తున్నారు. వైద్య వృత్తిని చేపట్టిన ఆయన కేవలం ఒక డాక్టర్‌గా మాత్రమే కాకుండా సమాజ సేవకుడిగా కూడా ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.డా. రఘు అనేక సంవత్సరాలుగా సమాజ సేవలో ముందుండి పనిచేస్తున్నారు. పేదలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అనాథాశ్రమాలను సందర్శించి సహాయం అందించడం అవసరమైన వారికి తక్షణ సహాయం చేయడం వంటి సేవా కార్యక్రమాలను ఆయన నిరంతరం కొనసాగిస్తున్నారు. సమాజ అభివృద్ధికి ఆరోగ్యం విద్య అనే రెండు ముఖ్య స్తంభాలని ఆయన నమ్మకం.తన పుట్టినరోజు సందర్భంగా కూడా వేడుకలకంటే సేవకు ప్రాధాన్యత ఇచ్చిన డా. రఘు కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్మీడియట్ టాపర్లకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే గొప్ప ప్రయత్నంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని డా. రఘు సేవా భావాన్ని అభినందించారు. విద్యార్థుల కృషిని గుర్తించి



ప్రోత్సహించడం ద్వారా మరింత మంది ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణ పొందుతారని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు ఈటెల రాజేందర్ డా. రఘును అభినందిస్తూ ఆయన సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని డా. రఘు తెలిపారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

**-ఇబ్రహింపట్నం ఎంపిడిఓ రామకృష్ణ**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఏప్రిల్ (21) :** విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఇబ్రహింపట్నం ఎంపిడిఓ రామకృష్ణ అన్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఒడ్డెర కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనపథకాన్ని మంగళవారం ఇబ్రహింపట్నం ఎంపీడీవో వోదెల రామకృష్ణ పరిశీలించారు.విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత,పరిశుభ్రత,మెనూ ప్రకారం వంట జరుగుతుందలేదాఅని విద్యార్థులతో మాట్లాడి విధ్యర్ధులతో కలిసి భోజనం చేశారు. సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు.వంటగది పరిశుభ్రతను పరిశీలించి, సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు.ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందినీ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పాఠశాలప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యురాలిగా ఎన్నిక

**-గురు రత్నాకర్‌రావు విగ్రహానికి నివాళి**



**చురకలు ప్రతినిధి కోరుట్ల ఏప్రిల్ 21 :** కోరుట్ల పట్టణంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యురాలిగా ఆస్మా షాయిస్తా (నజ్జు) మంగళవారం ఎన్నికైన సందర్భంగా ఆమె ఆనందం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ రాజకీయ ప్రస్థానానికి మార్గదర్శకులైన స్వర్గీయ శ్రీ జువ్వాడి రత్నాకర్ గారి ఆశయాలు మార్గదర్శకత్వం తమకు స్ఫూర్తినిచ్చాయని తెలిపారు కాంగ్రెస్ పార్టీ పట్ల నమ్మకంతో ప్రతి ఎన్నికల్లో చురుకుగా పాల్గొంటూ విజయానికి కృషి చేస్తూ వస్తున్నానని చెప్పారు జువ్వాడి నర్సింగరావు జువ్వాడి కృష్ణారావు జువ్వాడి శేఖర్ రావు అలాగే పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ ఆశీస్సులు సహకారంతో ఈ పదవి లభించిందని పేర్కొన్నారు.తమ కష్టానికి ఇది ప్రతిఫలంగా భావిస్తున్నానని అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు అనంతరం స్వర్గీయ శ్రీ జువ్వాడి రత్నాకర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పట్టణసహాయ కార్యదర్శులు ఎంబెరీ సత్యనారాయణ చిట్టిమెల్లి రంజిత్ కుమార్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వాసం అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన కమిషనర్



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 21 :** హుజురాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో స్థానిక మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాద్ అహ్మద్ మంగళవారం పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఆయా వీధుల్లో మురుగు కాలువలు, రోడ్లపై చెత్తాచెదారాన్ని సిబ్బందితో కార్మికులతో తొలగింప చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణంలో దోమల బెడద ఎక్కువగా ఉందని.. ఇప్పటికే ఫాగింగ్ చేయించామని, ప్రజలు వీధుల్లో చెత్త పడేవద్దని, డ్రైనేజీల్లోనూ చెత్త పడేయొద్దని సూచించారు. ప్రతినిత్యం ఆయా వీధుల్లోకి చెత్త వాహనాలు వస్తాయని, తడి చెత్త పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని కోరారు. ఎక్కడ పారిశుద్ధ్య సమస్య ఉన్న తమను సంప్రదించాలని సూచించారు. హుజురాబాద్ ను గ్రీన్ సిటీగా, కాలుష్య రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు కృషి చేయాలని కోరారు.

# కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

**-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**
**-ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం**





**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 21 :** రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచించారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మంగళవారం ప్రారంభించారు. ధాన్యం కుప్పలు, తేమ శాతం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. రైస్ మిల్లర్లు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దించుకొని ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ షేక్ సబేరా బేగం, తహసీల్దార్ సుజాత తదితరులు ఉన్నారు.

### మొన్న పోతిరెడ్డిపల్లిలో నేడు కిష్టంపల్లిలో...

# రోడ్డు కిరువైపులా ఉన్న చెట్ల నరికివేత


**-విద్యుత్తు లైన్ల కింద చెట్లను ఎందుకు పెంచినట్టు**
**-లక్షలాది రూపాయలు ఎందుకు వృధా చేస్తున్నట్లు ?**
**-ఇప్పటికైనా చెట్లను విద్యుత్తు లైన్ల కింద పెంచకండి**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 21 :** ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కిష్టంపల్లి కి కిషన్ దాస్ పేట నుండి వచ్చే విద్యుత్తు లైను కింద పెరిగిన చెట్ల కొమ్మలు తగిలి విద్యుత్ సరపరాకు తరచుగా అంతరాయం కలుగు తుండడంతో పాటు గృహ విద్యుత్తు వినియోగదారులు పలు ఇబ్బందులకు గురి అవుతున్నారు, పలువురి ఇండ్లలో వన్ హెచ్ పి విద్యుత్ మోటార్లు టీవీలు ఫ్రిజ్జులు ఏసీలు వాషింగ్ మిషన్లు ఫ్యాన్లు విలువైన విద్యుత్ బల్బులు తరచుగా కాలుతుండడంతో కిష్టం పల్లి గ్రామస్తులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ విషయాన్ని కిష్టంపల్లి గ్రామస్తులు అధికార కాంగ్రెస్‌పార్టీ నాయకులకు సెస్ డైరెక్టర్ వరుస కృష్ణ హారికి విద్యుత్ అధికారులకు స్థానిక సర్పంచు ఎలగందుల నరసింహులు ఉపసర్పంచ్ బందారపు బాలెడ్డి వార్డు సభ్యులు గాండ్ల ఆంజనేయులు దృష్టికి తీసుకువెళ్ళి ఆందోళన వ్యక్తం చేశారు, దీంతో వెంటనే స్పందించిన సర్పంచ్ ఎలగందుల నరసింహులు గ్రామ పంచాయతీ సిబ్బందితో కిష్టంపల్లి విద్యుత్ లైన్ల కింద గ్రామపంచాయతీ వారు పెంచిన చెట్లను ఏకంగా నరికి వేయించి విద్యుత్తు లైనుకు ఎలాంటి అంతరాయం కలగకుండా లైన్ క్లియర్ చేయించారు. విద్యుత్తు లైన్ల కింద లక్షలాది రూపాయలు ఖర్చుచేసి చెట్లను నాటుడు ఎందుకు కొట్టేసుడు ఎందుకు అని పర్యావరణ ప్రేమికులు ప్రశ్నిస్తున్నారు. మొన్న పోతురెడ్డిపల్లి గ్రామం నుండి కోనరావుపేట వెళ్లే మార్గంలో ఇద్దరు రైతులు తన వరి పొలానికి నీడనిస్తున్నాయని ఏకంగా 36 కు పైగా నీడనిచ్చే చెట్లను నరికి వేశారు దీంతో పంచాయతీ కార్యదర్శి కేవలం 36 కు పైగా నీడనిచ్చే చెట్లను నరికి వేసిన ప్రబుద్ధులకు కేవలం రెండు వేల రూపాయల జరిమానా విధించి చేతులు దులిపేసుకున్నారు ఆ సంఘటన మరు వకముందే మళ్ళీ కిష్టంపల్లిలో చెట్ల నరికివేత జరిగింది. అధికారులు చెట్లను పెంచే ముందు ఆలోచించి నిర్ణయాలు తీసుకుని విద్యుత్తు లైన్లకింద చెట్లను పెంచకుండా చర్యలు తీసుకో వాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

# 2.30 లక్షల విరాళం ఇచ్చిన తుమ్మల సుభాషిని-తిరుమల్ రెడ్డి

**-ధర్మారం ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి దాతృత్వాన్ని చాటుకున్న దంపతులు**



**చురకలు ప్రతినిధి, హనుమకొండ ఏప్రిల్ 21 :** నడికూడ మండలం ధర్మారం గ్రామంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి సహిత కంఠమహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి విరాళాల వెల్లువ కొనసాగుతోంది. ఈ క్రమంలో ధర్మారం గ్రామ మాజీ సర్పంచ్, ఒడిసిఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ గోలుకొండ సదానందం ప్రోత్సాహంతో ప్రముఖ దాతలు తుమ్మల సుభాషిని – తిరుమల్ రెడ్డి దంపతులు ఆలయ నిర్మాణానికి రూ. 2,30,000/- (రెండు లక్షల ముప్పై వేల రూపాయల) భారీ విరాళాన్ని అందజేసి తమ దైవభక్తిని, ఉదారతను చాటుకున్నారు. సేవా గుణంలో సాటిలేని దంపతులు : తుమ్మల సుభాషిని-తిరుమల్ రెడ్డి దంపతులు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా, సమాజ సేవలోనూ ముందుంటు న్నారు. ఎందరో పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు అందించడంలో సహాయం చేయడం, పేద యువతుల వివాహాలకు ఆర్థికంగా అండగా నిలవడం, గ్రామంలో జరిగే పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం వంటి పనులతో వారు నిరంతరం ప్రజాభిమానాన్ని పొందుతున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రతినిధులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి ఇంతటి భారీ ఆర్థిక సాయం అందించిన పుణ్య దంపతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దీవెనలతో వారు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కత్తి మొగిలి, పిల్లల తిరుపతి, దూలం వెంకటేష్ గౌడ్, పల్లె వెంకన్న గౌడ్ (ధర్మారం ఉపసర్పంచ్) బాల్లే రఘుపతి (మాజీ సర్పంచ్) గ్రామస్తులు, గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాతకు పంచామృతాలతో అభిషేకం ప్రత్యేక పూజలు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 21 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ దుర్గా మాత ఆలయంలో మంగళవారం శ్రీదుర్గా మాతకు ఆ కాలనీ కి చెందిన మహిళలు పంచామృతాలతో శ్రీ దుర్గా మాతకు అభిషేకం చేసి వివిధ రకాల పళ్ళతో రంగురంగుల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళాభక్తులు దుంపెన స్రవంతి, మీనా పద్మ మంజుల లతా వరలక్ష్మి మౌనిక బండారి అశ్విని ప్రేమల లక్ష్మి తదితరులు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను సందర్శించిన స్థానిక సర్పంచ్ కొండ రమేష్ గౌడ్



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 21 :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామం లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో సమస్యల పై 5 వార్డు సభ్యురాలు అరుణ జ్యోతి స్థానిక సర్పంచ్ కొండ రమేష్ గౌడ్‌కు ఉప సర్పంచ్ పొన్నాల మణెమ్మకు పాలక వర్గ సభ్యులకు పంచాయతీ కార్యదర్శికి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంగళవారం సర్పంచ్ కొండ రమేష్‌గౌడ్ ఉప సర్పంచ్ పొన్నాల మణెమ్మ పాలకవర్గ వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి రామ కృష్ణ వెంటనే స్పందించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ మాట్లాడుతూ సమస్యలు చూసి వాటిని వెంటనే పరిష్కరిస్తామని 5వ వార్డు సభ్యురాలుకు డబుల్ బెడ్ రూమ్ వాళ్ళకి హామీ ఇచ్చారు. చెట్ల కొమ్మలను పేరుకుపోయిన డ్రైనేజి సమస్యలను తొందరలోనే శాశ్వత పరిష్కారం చేస్తాం అని ఆయన తెలిపారు.

## భైంసా ఏఎస్పీ రాజేష్ మీనాకు ఘన వీడ్కోలు




**చురకలు ప్రతినిధి, నిర్మల్, ఏప్రిల్, 21 :** భైంసా ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న రాజేష్ మీనా అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది వనపర్తి జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జానకి షర్మిల అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందిన రాజేష్ మీనా ఎస్పీ జానకిషర్మిల సింహ తలాట చిహ్నాన్ని అలంకరించి అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వీడ్కోలు సమావేశంలో జిల్లాతో పాటు అడిషనల్‌ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా, ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

# కోరిన కోర్కెలు తీర్చే ధర్మపురి నారసింహుడు

**-ఏప్రిల్ 22 నుండి నరసింహ నవరాత్రి ఉత్సవాలు**

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

"భూషణ వికాస శ్రీ ధర్మపుర నివాస దుష్ట సంహార నరసింహ దురితదూర" అనే మకుటంతో భక్తాగ్రేసరుడు శేషప్ప (కాకుం శేషా చలదాసు) రచించిన నరసింహ శతకంలోని పద్యాల మాధుర్యాన్ని ఆస్వాదించని తెలుగువా రుండరంటే అతిశయోక్తి కాదేమో... భారతీయ ప్రాచీన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టు కొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు కేంద్ర బిందువుగా పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసి ఆస్తిక ప్రపంచానికి వరదాయిగా, భక్తి, ముక్తి ప్రదాయినిగా విరాజిల్లుతున్నది... సుప్రసిద్ధ ప్రాచీన ధర్మపురి పుణ్యతీర్థం.కరీంనగర్‌కు 71 కిలోమీటర్ల ఉత్తరాన,జగిత్యాలకు 27 కిలోమీ టర్ల ఈశాన్యాన తెలంగాణ లోని సుప్రసిద్ధ పుణ్య క్షేత్రంగా,దక్షిణ కాశీగా,నవనారసింహ క్షేత్రాలలో ఉత్కృష్ట మైనదిగా,పౌరాణిక,ఐతిహాసిక, చారిత్రక ప్రాధాన్యతను సంతరించు కున్నదీ క్షేత్ర రాజం.ప్రధానంగా శివకేశవుల నిలయమై,శ్రీలక్ష్మీనరసింహ ,రామలింగేశ్వర ఆలయాలు,మసీదు పక్కపక్కనే కలిగి అనాదిగా వైష్ణవ, శైవ ముస్లిం మత సామరస్యానికి ప్రతీకగా నిలచి ఉన్నదీ పుణ్యతీర్థం. బ్రహ్మాండ, స్కంధ పురాణాలలో, మడికె సింగన పద్మ పురాణంలో,చెరి కొండ ధర్మన్న చిత్ర భారతంలో,కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో,ఏకామ్ర నాధుని ప్రతాపరుద్ర చరిత్రలో, నృసింహదాసు మైరావణ చరిత్రలో, పోతనామాత్యుని నారాయణ శత కంలో, పింగళి సూరనార్యుని కళాపూర్ణో దయంలో, శేషాచలదాసు - నరహరి, నృసింహ,నృకేసరి శతకాలలో, కాకతీ యానంతర శాసనాలలో, మధ్యయుగ దానపత్రాలలో ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం ప్రశంసించ బడింది. పూర్వం ధర్మవర్మ మహారాజు ధర్మదేవత భక్తుడై, ప్రజలను ధర్మ కార్యోన్ముఖులను చేయడానికి



చేసిన తపస్సు ఫలితంగా "ధర్మపురి" నామాంకిత, నృసిం హుడు భక్తుల కోర్కెలు తీర్చేందుకై ఇచ్చట వెలసి యున్నాడని,పురాణాలు స్పష్ట పరుస్తు న్నాయి.గౌతమ మహర్షి,తన బ్రహ్మహత్య పాతకాన్ని పోగొట్టుకునేందుకు పరమ శివుని గూర్చి తపస్సు చేసి,ఆయన జటాజూటం నందు గల "గంగా దేవి"ని ధర్మపురికి రప్పించినందున "గౌతమి, గోదావరి" అని నదీ పేర్లు వచ్చినట్లు స్థల పురాణం విశద పరుస్తున్నది. శ్రీరామచంద్ర స్థాపిత రామేశ్వరాలయం, అక్కపెల్లి రాజేశ్వరాలయం, శ్రీరామా లయం,దత్తాత్రేయ,గౌతమేశ్వర,శ్రీసాయి శివ బాలాజీ,అయ్యప్ప, ప్రసన్నాంజనేయ ,భక్తాంజనేయ,యమ ధర్మరాజ, సంతోషిమాత,సత్యవతీ,మహాలక్ష్మి మందిరాలు ప్రత్యేకతను కలిగి ఉన్నాయి.రామాయణ,భారత,భాగవ తాది పురాణ ఘట్టాలు చెక్కబడిన నృసింహాలయపు కాకతీయుల శిల్ప కళకు అద్దం పట్టే కళ్యాణ మంటపం, శివాలయంలోని గణేష,చండిక, సప్త మాతృకలు,నల్లశెనపు రాతిపై సమంశ పద్ధతిలో చెక్కబడిన శ్రీరామలక్ష్మణ, సీతాదేవిల విగ్రహాలు మిగుల మనోజ్ఞమై ఉన్నాయి.ధర్మపురి క్షేత్రం మొదట జైన,బౌద్ధ యుగములందు ఆర్ష విద్య ప్రచార కేంద్రమై విదర్భరాజ్య పోషణలో మున్యాశ్రమంగా ఉండేది.తర్వాత శాతవాహన,బాదామి చాళుక్య, రాష్ట్రకూట,కళ్యాణి చాళుక్య, కాకతీయ, రేచర్ల వెలమల మరియు నైజాం రాజుల ఏలుబడిలో అద్వితీయ వైభవాన్ని అనుభవించింది.ప్రతాప రుద్రుని కాలంలో ఢిల్లీని ఏలిన అల్లావుద్దిన్ ఖిల్జీ సేనాని మాలిక్ నాయబ్ కాపూర్ సైన్యం క్రీస్తు శకం1309లో ఇందూరు (నిజామాబాద్) మీదుగా కాకతీయులపై దండెత్తిన సమయంలో ఇచ్చటి నృసింహాలయం, రామేశ్వరా లయాలను ధ్వంసం చేసినట్లు చరిత్ర చెబుతున్నది. 14వ శతాబ్ది మూడవ పాదంలో నారాయణాశ్రమ స్వామి అనే సన్యాసి, నాటి రామగిరి పాలకుడైన ముప్ప భూపతి సేనాని కేశనమంత్రి సాయంతో నారాయణ పురమను మఠంను స్థాపించి ,బ్రాహ్మణులకు గృహములను నిర్మింప జేసి, అన్నసత్రాన్ని నెలకొల్పారు. 1724-50 మధ్య ధర్మపురివాసులు తిరిగి నృసింహాలయాన్ని నిర్మించారు.

**క్షేత్ర ప్రాశస్త్యం**

ఆద్వితీయ మహిమాన్వియైన ధర్మపురి క్షేత్రమున యాత్రికుల సౌకర్యార్థం నివాస స్థానములను కట్టించువారు భగవత్కటాక్షమున ఉత్తమ భవనముల పొందగలరని, ఇచ్చటి జీర్ణ మందిరములను ఉద్ధరించువారు వైకుంఠమునందు ఉత్తమ సుఖములను అను భవించగలరని, శ్రీనృసింహుని పూజ కొరకు పూల చెట్లను పెంచువారు నందనాది వనములతో సౌఖ్యములను అను భవించ గలరని, శ్రీనృసింహు శాల్యన్నమును,దధ్యన్నమును మరియు పులిహోరను నైవేద్యమిడు వారు అన్నదాతలై భగవత్కటాక్షమునకు పాత్రు లగుదురని, నృసింహుని ప్రీతికై క్షేత్రమున బ్రహ్మణులకు భూదానం, గోదానం మరియు హిరణ్యాది దానములనొసంగువారు ముందు జన్మమున సార్వభౌముల గుదురని, క్షేత్రమున దీనాందులకు,దంపతులకు, బ్రహ్మచారులకు,పశుపక్ష్యాదులకు అన్నదాన మొనర్చినచో,నృసింహ కటాక్షమున వారి వారి పితృదేవతలు మోక్షమును పొందగలరని,శౌనకాది మహర్షు లకు నైమిషారణ్యము నందు శూత పౌరాణికులు వివరించినట్లు స్కంధ పురాణాంతర్గత ధర్మపురి

**క్షేత్ర మహత్యం విశదపరుస్తున్నది.**

**నరసింహ అవతార ప్రత్యేకత**

రామకృష్ణాది అవతారములవలె గాక,నిర్యాణములేని శాశ్వత అవతారమై న శ్రీనరసింహుని జయంతి, హిందూ పండగలలో అత్యంత ఆధ్యాత్మిక ప్రాధాన్యత నొందింది.వైశాఖ శుద్ధ చతుర్దశి పుణ్య తిథియందు ఉద్భవించిన నారసింహుని పూజలతో,ఆకాల మృత్యు భయముండదని,దుష్టగ్రహ బాధలు, పైశాచిక చేతబడుల ప్రయోగాలను తిప్పికొట్టే శక్తి నారసింహ మంత్రానికి గలదని భక్తుల,సాంప్రదాయా చరణా సక్తుల ప్రగాఢ విశ్వాసం. "ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతో ముఖం, నృసింహం భీషణం భద్రం మృత్యు మృత్యుం నమామ్యహం" మంత్రంతో నరసింహ స్వామిని పూజిస్తే శత్రు జయం కలుగుతుంది.పగలు రాత్రి కాని సంధ్యా. సమయాన, నరుడు జంతువు కాని రూపంతో, భూమ్యాకాశాలు కాని తొడలపై, సజీవము నిర్జీవ మూకాని చేతిగోళ్ళతో, హిరణ్యకశిపుని చీల్చి భక్త జన రక్షకుడై, సుదర్శన, శంఖ, చక్ర, ఖడ్గ, అంకుశ, పాశు, పరశు, ముసల, కులిశ, పద్మాదులను కలిగిగదాధరుడై ప్రకాశించిన ఉగ్రనారసింహ అవతార తత్వం మిగతా అవతారాలకు భిన్నం.

**నరసింహ నవరాత్రులు**

కోరిన కోర్కెలు తీర్చే ధర్మపురి లక్ష్మీ సమేత నారసింహ (యోగ, ఉగ్ర) నవరాత్రి ఉత్సవాలు ఏప్రిల్ 22వ తేదీ నుండి 30వ తేదీ వరకు సాంప్ర దాయ రీతిలో జరుగనున్నాయి.సర్వ దేవతా మూర్తులను కలిగి 'ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదు' అని విఖ్యాతి నందిన ప్రాచీన చరిత్ర మరియు పౌరాణిక ప్రాధాన్యత కలిగిన ధర్మపురి క్షేత్రంలో ఏటా వైశాఖ శుక్ల షష్టి నుండి చతుర్దశి వరకు స్థానిక దైవాల నవరాత్రి ఉత్సవాలు సాంప్రదాయ రీతిలో నిర్వహించడం అనాదిగా ఆచరణలో ఉంది. ఈ సంవత్సరం ప్రధానంగా 25న అన్నకూటోత్సవం, 26 న సహస్ర కలశాభిషేకం,27న చందనోత్సవం, 28న వసంతోత్సవం,పల్లవోత్సవం, అన్న కూటోత్సవం,నిత్య ఆరాధనలతో పాటు 29న లక్ష తులసీ పూజ, సాంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.30న నర సింహ జయంతి, ప్రత్యేక స్థంభోద్భవ పూజాది కాలు నిర్వహించ నున్నారు.దేవస్థానం ఏసి,ఈఓ సంకటాల శ్రీనివాస్,ఆస్థాన వేద పండితులు బొజ్జా రమేశ శర్మ, వివిధ ఆలయాల అర్చకులు, సిబ్బంది కార్యక్రమాల ఏర్పాట్లు, నిర్వహణలలో నిమగ్నమై ఉన్నారు.

# ఉద్యమ కారుల గుర్తింపు కోసం కమిటీ వేయడం హర్షనీయం

**-అమరవీరుల కుటుంబాల వేదిక రాష్ట్ర అధ్యక్షులు సతీష్ కుమార్**

**జగిత్యాల ప్రతినిధి, ఏప్రిల్ 21 :** తెలంగాణ అమరవీరుల కుటుంబాలను, తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేయడం మంచి పరిణామని తెలంగాణ అమరవీరుల కుటుంబాల వేదిక రాష్ట్ర అధ్యక్షులు చిర్ర సతీష్



కుమార్ జగిత్యాలలో మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ ఉద్యమంలో 1200 మంది ఆత్మ బలిధానం చేసుకున్నారని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా ప్రకటించారని, అప్పుడు 589 మందిని గుర్తించి వారికి ? 10 లక్షల ఏక్స్రేషియా ఇవ్వడంతో పాటు ఉద్యోగాలను సైతం ఇచ్చిందని సతీష్ కుమార్ గుర్తు చేశారు.మిగిలిన కురటుంబాలను గుర్తించి వారిని ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేసే దిశలో అడుగులు వేస్తూ సీనియర్ నేతలైన కేశవ రావు చైర్మన్ గా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రొఫెషర్ కోదండరాం,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ సభ్యులతో ప్రభుత్వం ఒక కమిటీని వేయడం హర్షనీయమని ఆయన పేర్కొన్నారు.ఈ కమిటీ ఆధ్వర్యంలో అమర వీరుల కుటుంబాలు, ఉద్యమ కారుల కుటుంబాలకు న్యాయం జరుగుతుందని సతీష్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు.

## కోరుట్లలో జిల్లా విద్యాశాఖ అధికారి పర్యటన

**-బడిబాట ప్రారంభం**

**-సీసీ కెమెరాల ఆవిష్కరణ**




**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఏప్రిల్ 21 :** జగిత్యాల జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము మంగళవారం కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (జెడ్ పి హెచ్ ఎస్ గర్ల్స్ )ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి నిర్వహణ శిక్షణా కార్యకలాపాలను సమీక్షించారు.ప్రధాన అంశాలు...బడిబాట కార్యక్రమం ప్రారంభం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచే లక్ష్యంతో చేపట్టిన బడిబాట కార్యక్ర మానికి సంబంధించిన పోస్టర్‌ను డీఈఓ ఆవిష్కరించారు.ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అందుబాటులో ఉన్న ఆధునిక సౌకర్యాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

**సీసీ కెమెరాల ఆవిష్కరణ**

విద్యార్థినుల భద్రతను పెంపొందించేందుకు మరియు పాఠశాల నిర్వహణను పారదర్శకంగా మార్చేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరా వ్యవస్థను ప్రారంభించారు. సాంకేతికత వినియోగం ద్వారా పాఠశాల పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా మారుతుందని తెలిపారు.

**జనాభా గణన శిక్షణ పరిశీలన**

పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న జనాభా గణన 2027 ఫీల్డ్ ట్రైనర్ల శిక్షణా తరగతులను ఆయన పరిశీలించారు.గణన ప్రక్రియలో తప్పులు లేకుండా యాప్ వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ట్రైనర్లకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జి.నరేషం,ప్రధానోపాధ్యా యులు వి.గంగాధర్,నోడల్ ఆఫీసర్ ఎం. చంద్రశేఖర్ పాల్గొన్నారు.ఫీల్డ్ ట్రైనర్లు ఎస్. పూర్ణచందర్,ఎస్.రాజేష్,ఎన్.రాజ్ కిరణ్,ఏ.మహేష్ హాజరయ్యారు.

## హుజురాబాద్లో పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు

**-సబ్ రిజిస్ట్రార్ మహమ్మద్ ఇంతియాజ్**

**చురకలు ప్రతినిధి, హుజురాబాద్, ఏప్రిల్ 21 :** హుజురాబాద్ డివిజన్లో పారదర్శకంగా ప్లాట్ల భూముల రిజిస్ట్రేషన్లు చేస్తున్నామని స్థానిక సబ్ రిజిస్ట్రార్ మహమ్మద్ ఇంతియాజ్ తెలిపారు.మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. అసైన్డ్ భూములు,ప్రభుత్వ భూములు, ఇరిగేషన్,ఎస్సారెస్పీ,నిషేధిత జాబితాలోని భూముల పట్ల అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు.రిజిస్ట్రేషన్ల సమయంలో అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తున్నామని,మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు.వ్యవసాయ భూములు రెవిన్యూ విభాగం ద్వారా నాలా కన్వర్షన్ అయినా తర్వాతే ధృవీకరించుకుని రిజిస్ట్రేషన్ చేస్తున్నామని,అనుమతిలేని రియల్ ఎస్టేట్ వెంచర్ల విషయలంలోనూ జాగ్రత్తలు వహిస్తున్నామని పట్టణ శివారులోని భూములు,ప్లాట్ల రిజిస్ట్రే షన్ విషయంలో స్వయంగా పరిశీలించినతర్వాతే ముందుకువెళ్తున్నామని వివరించారు.

## సగర భగీరథ మహర్షి జయంతిని విజయవంతం చేయాలి



**చురకలు విలేఖరి వీణవంక ఏప్రిల్ 21 :** సగర భగీరథ మహర్షి జయంతిని విజయవంతం చేయాలని సగర సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దేవునూరి శ్రీనివాస్ సగర కోరారు.ఈ మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ చిత్రామిశ్రాను కలిసి వినతిపత్రం అందజేయడంతో పాటు అన్ని గ్రామాల్లో వాల్‌పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల23న సగర భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ప్రభుత్వం అధికారికం గా నిర్వహించడం గొప్పవిషయమన్నారు.కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించి కార్యక్రమానికి సగర బంధువులతో పాటు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో విజయవంతం చేయాలని కోరారు.జిల్లాలోని అన్ని గ్రామాల్లో కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి అనిల్ ప్రకాష్ కిరణ్,సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టరాజు సగర,జిల్లా కోశాధికారి కాటిపెల్లి కుమారస్వామి సగర ఉన్నారు.

# ధాన్యం సేకరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలి

**-జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 21 :** వరిధాన్యం సేకరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత అన్నారు. మంగళవారం జిల్లాసమీకృత కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో రా మరియు బాయిల్డ్ రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో యాసంగి 2025-26 వరిధాన్య సేకరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా,వేగంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత సంబంధిత అధికారులను,రైస్ మిల్లర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బిఎస్.లత మాట్లాడుతూ యాసంగి సీజన్కు సంబంధించి ధాన్యం కొనుగోలు, దిగుమతుల్లో ఎటు వంటి జాప్యం జరగకుండా చూడాలని, లారీల అన్-లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. మిల్లుల వద్ద ధాన్యం లారీలు నిల్వలు పేరుకుపోకుండా ఉండాలంటే సరిపడా సంఖ్యలో హమాలీలను ముందస్తుగానే ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. రబీ 2024-25 ఖరీఫ్ 2025-26 ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు కస్టమ్ మిల్లింగ్ రైస్ ప్రక్రియను సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు .వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు వరిధాన్యం చేరే వరకు పౌర సరఫరా నాయబ్ తహశీల్దారులు మరియు సివిల్ సప్లై ఇన్స్పెక్టర్లు, జీపివోలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, రైస్ మిల్లర్లు మరియు ట్రాన్స్ పోర్టర్లు సమన్వయం చేసుకుని ధాన్యంకొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా మరియు వేగవంతంగా అయ్యేలా అన్ని రకాల ముందస్తుచర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ జితేంద్ర ప్రసాద్,నాయబ్ తహశీల్దారులు , సివిల్ సప్లయ్ ఇన్స్పెక్టర్లు, జిల్లాలోని రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# కోమా స్థితిలో మాతృభూమిపై తుదిశ్వాస విడిచిన గల్ఫ్ కార్మికుడు

**-మానవతా దృక్పథంతో స్పందించిన సీఎం**
**-రూ.5 లక్షలు ఆర్థిక సహాయం మంజూరు**
**-చొరవ చూపిన జి. చిన్నారెడ్డి, ఐఏఎస్ అధికారిణి దివ్యా దేవరాజన్**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 21:** దుబాయి నుంచి కోమా (అపస్మారక స్థితి)లో తెలంగాణకు తరలింపబడి,చికిత్స పొందుతూ పది రోజులు మృత్యువుతో పోరాడి మాతృ భూమిపై తుదిశ్వాస విడిచిన జగిత్యాల జిల్లా, జగిత్యాల రూరల్ మండలం, పొలాస గ్రామానికి చెందిన ఆరెల్లి గంగారాజం అనే గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. సీఎం ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జి. చిన్నారెడ్డి, సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్, ఐఏఎస్ అధికారిణి దివ్యా దేవరాజన్ లు మంగళవారం హైదరాబాద్ ప్రజాభవన్ లో మృతుడి భార్య ఆరెల్లి రాజవ్వకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వైజరీ కమిటీ ఛైర్మన్,అంబాసిడర్ డా. బి.ఎం. వినోద్ కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి,మెంబర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి,ప్రవాసీ ప్రజావాణి కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఆరెల్లి గంగారాజం (61)కిడ్నీ సంబంధిత వ్యాధితోతీవ్ర అనారోగ్యానికి గురై,2025 నవంబర్ 12న దుబాయి లోని ఆస్టర్ హాస్పిటల్లో కోమా స్థితిలో చేర్చబడ్డారు. మెరుగైన చికిత్స కోసం డిసెంబర్ 14న హైదరాబాద్కు తరలించి,నిమ్స్లో చేర్చారు. అనంతరం రీహాబిలిటేషన్ సెంటర్లో చికిత్స పొంది, చివరకు జగిత్యాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డిసెంబర్ 24న మరణించారు. జి.ఓ.నెం.216 ప్రకారం గల్ఫ్ దేశాల్లో మరణించిన వలస కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్ గ్రేషియా అందజేస్తోంది. అయితే ఈ కేసులో మరణం భారత్లో చోటుచేసుకోవడం తో, మరణ స్థలం గల్ఫ్ దేశం అయి ఉండాలి అనే సాంకేతిక నిబంధన కారణంగా ఆర్థిక సహాయం పొందడంలో ఆటంకం ఏర్పడగా... సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా చెల్లించి కుటుంబాన్ని ఆదుకున్నారు. మానవతా దృక్పథంతో ప్రత్యేక కేసుగా పరిగణించి 5లక్షల గల్ఫ్ ఎక్స్ గ్రేషియా మంజూరు చేయాలని మృతుడి భార్య రాజవ్వ,కుమారుడు జలంధర్ మార్చి 31న హైదరాబాద్ ప్రజాభవన్లో నిర్వహించిన సీఎం ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేరిట వినతిపత్రం సమర్పించారు. జగిత్యాల ఎమ్మెల్యే డా.మాకునూరి సంజయ్ కుమార్కు దరఖాస్తు ప్రతిని పంపించారు. అదే సమయంలో ప్రవాసీ ప్రజావాణి హెల్ప్ డెస్క్ను సందర్శించిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణల దృష్టికి ఈ సమస్య వచ్చింది. గల్ఫ్ కార్మికులు,వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి ఈ సందర్భంగా అన్నారు. ప్రత్యేక కేసుగా పరిగణించి గల్ఫ్ ఎక్స్ గ్రేషియా మంజూరును పరిశీలించాలని ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి. శేషాద్రి ని కోరుతూ డా.జి.చిన్నారెడ్డి దరఖాస్తుపై ఎండార్స్ చేశారు. ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించాలని ఐఏఎస్ అధికారిణి దివ్యా దేవరాజన్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులుతో ఫోన్ లో చర్చించి,ప్రభుత్వానికి డి.ఓ.లేఖ రాశారు .మృతుడి భార్య రాజవ్వ, కుమారుడు జలంధర్ లు ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి తో పాటు సెక్రటేరియట్ కు వెళ్లి సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు ను కలిసి ఆర్థిక సహాయం చెక్కు విడుదలలో కీలకంగా వ్యవహరించి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. పేషేంట్ ను దుబాయి నుంచి స్వదేశానికి తరలించడం నుండి అన్ని రకాలుగా సహకరించిన జీఏడీ ఎన్నారై సెల్ సెక్షన్ ఆఫీసర్ కంచర్ల శ్రీనివాసరెడ్డి,అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ సమీనాబేగం,పి. రాజీవ్ కుమార్లను కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గల్ఫ్ కార్మిక కుటుంబాలను మానవతా దృక్పథంతో ఆదుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డా. మాకునూరి సంజయ్ కుమార్, అధికార యంత్రాంగానికి పొలాస సర్పంచ్ మిల్కూరి శంకరయ్య, డిసిసి అధ్యక్షులు గాజెంగి నందయ్యలు కృతజ్ఞతలు తెలిపారు.

# తహసీల్దార్ ఆఫీసు ఎదుట ఆమరణ నిరాహార దీక్ష

**-బతికి ఉండగానే డెత్ సర్టిఫికేట్ మంజూరు**



**చురకలు విలేకరి, మల్లాపూర్, ఏప్రిల్ 21 :** మల్లాపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మొగిలిపేట గ్రామానికి చెందిన వృద్ధ రైతు మంగళవారపు గంగారాం ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. బతికి ఉండగానే డెత్ సర్టిఫికేట్ అక్రమంగా వేరే వాళ్లకు విరాసత్ చేసిన రెవెన్యూ అధికారులతో పాటు డెత్ సర్టిఫికేట్ ఇచ్చిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాదిత వృద్ధ రైతు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆమరణ దీక్షకు పూనుకున్నాడు. మండల నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులు సంఘీబావం తెలిపి బాదితులకు న్యాయం చెయ్యాలని వారు డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి తహసీల్దార్ రామచందర్, ఎస్సై అనిల్ చేరుకుని అక్రమ పట్టా చేసుకున్న అక్రమార్కులపై తగు చర్యలు తీసుకుంటామని పూర్తి నివేదికను రెవెన్యూ ఉన్నత అధికారులకు అందజేసి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆమరణ నిరాహారదీక్ష ను విరమింప చేశారు.

## పర్యావరణ పరిరక్షణపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 21 :** జగిత్యాల జిల్లాలో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు రూపొందించిన ప్రత్యేక పోస్టర్ను మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కలెక్టర్ ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. చెట్ల పెంపకం, నీటి సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు వంటి అంశాల్లో ప్రతి ఒక్కరూ చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించేందుకు సమాజంలోని అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. పోస్టర్లో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ముఖ్య అంశాలు, సందేశాలు, అలాగే సేంద్రీయ ఎరువుల వినియోగం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం వంటి సూచనలు ... ప్రతిబింబించబడ్డాయి. ఈ పోస్టర్ను జగిత్యాల జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల వద్ద ప్రదర్శించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కె రాము, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

## పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ



**చురకలు విలేకరి,మెట్పల్లి రూరల్, ఏప్రిల్ 21 :** మెట్పల్లి మండల వెల్లుల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల క్రమంలో మంగళవారం పాఠశాలలోని మధ్యాహ్నం భోజనం తనిఖీ జరిపారు. దీనిలో భాగంగా మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఉమేష్ మరియు సర్పంచ్ గూడూరి తిరుపతి విద్యార్థులతో కలసి భోజనం చెసి పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు మారుతి,జిపిఓలు నాగరాణి, రాజేశం మరియు అధ్యాపకులు స్వప్న,వేణు తదితరులు పాల్గొన్నారు.

## బడిబాట కార్యక్రమం విజయవంతం చేయాలి



**చురకలు విలేకరి,మెట్పల్లి రూరల్, ఏప్రిల్ 21 :** ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి బడిబాట కార్యక్రమం విజయవంతం చేయాలనీ సర్పంచ్ గుర్రం బాలరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని రంగారావుపేట్ గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించగా పిల్లల తల్లితండ్రులకు ప్రభుత్వ పాఠశాల గురించి అవగాహనా కల్పించారు. అన్ని రకాల వసతులతో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని ఉపాధి హామీ దగ్గర చిన్నారుల తల్లితండ్రులకు కలిసి వివరించారు. ఇందులో ఉపసర్పంచ్ పెద్దరాజన్న,వార్డ్ సభ్యులు వెంకటేష్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపక బృదం, అంగన్వాడీ టీచర్ సుమలత తదితరులు ఉన్నారు.

# మక్కల రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది

**-కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం**

**-ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఏప్రిల్ 21 :** పెద్దపల్లి జిల్లా కేంద్రం లోని వ్యవసాయ మార్కెట్లో మక్కల కొనుగోలు కేంద్రంతో పాటు సింగిల్ విండో సెంటర్ ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్, స్థానిక అధికారులు, నాయకులతో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే విజయరమణ రావు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసే కూరగాయల మార్కెట్ స్థలాన్ని మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ సిబ్బంది మరియు అధికారులతో కలిసి పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉందని రైతులెవరు నష్టపోవద్దని సంకల్పంతో కొనుగోలు చేపడుతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. వేసంగి పంటను కొనుగోలు చేసి బాయిల్డ్ ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి ఢిల్లీకి వెళ్లి సంబంధిత కేంద్ర మంత్రికి విన్నవించడం జరిగింది అన్నారు. రైస్ మిల్లులను అప్రమత్తం చేస్తున్నామ న్నారు. మక్కలు వరి పండించిన రైతులెవరు అధైర్య పడవద్దని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని తెలిపారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ధాన్యాన్ని కటింగ్ పేరుతో నిలువు దోపిడి చేశారని 15 కిలోల నుండి 20 కిలోల వరకు కట్ చేసిన సందర్భాలు ఉన్నాయని అలాంటివి ఏవి లేకుండా నేడు ఐదు పసళ్ళు గింజ కటింగ్ లేకుండా కొనుగోలు చేశామని తెలిపారు.రైతులు ప్రభుత్వం సూచించిన విధంగా వరి ధాన్యానికి 15% తేమ శాతం, మొక్కలకు 14% మ్యాచర్ వచ్చేలా చూడాలని కోరారు. సంబంధిత జిల్లా కలెక్టర్ వ్యవసాయ సింగిల్ విండో తదితర అధికారులు అందుబాటులో ఉన్నారని రైతులు ఎవరు ధైర్యపడవద్దని రైతులకు వడగళ్ల వానలు వచ్చిన ఎలాంటి ఇబ్బందులు లేకుండా గన్ని సంచులు కవర్లు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు.అలాగే రైతుల వివిధ రకాల ధాన్యానికి సంబంధిత రేట్లను సూచించే పట్టికలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రైతులు పండించిన ప్రతి దాన్యపు గింజలతో పాటు మక్కలను కొనుగోలు చేస్తామని ఆ బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు,డీసీఓ శ్రీమాల, వ్యవసాయ అధికారులు,వ్యవసాయ మార్కెట్ చైర్మన్,కూర మల్ల రెడ్డి, మున్సిపల్ చైర్మన్,నూగిల్ మల్లయ్య, జిల్లా మార్కెట్ కమిటీ అధికారి ప్రవీణ్, మార్కెట్ డైరెక్టర్లు,పట్టణ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు,కాంగ్రెస్పార్టీ మండల అధ్య క్షులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహనుల రాజధానిని

# పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తా

**-పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఏప్రిల్ 21 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల శాతవాహన రాజధాని, కోటేశ్వరస్వామి ఆలయం, పవిత్ర గోదావరి తీరప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తా నని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ స్పష్టం చేశారు. మంగళవా రం కోటిలింగాల ఆలయ ప్రాంగణం లో జరిగిన శ్రీ పార్వతి కోటేశ్వరస్వామి కళ్యాణోత్సవం లో ఎంపీ పాల్గొన్నారు.ఆలయ కమిటీ ఈ ఓ ఆధ్వర్యంలో అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.స్వామి వారి కళ్యాణత్సవాన్ని తిలకించారు. కళ్యాణ తీర్థప్రసా దాలు అందజేసి శాలువాతో సత్కరించి స్వామి వారి చిత్ర పఠాన్ని అందజేశారు.కోటిలింగాల విషయంపై పెద్దపల్లి పార్లమెంట్లో ప్రస్తావించడం జరిగిందని కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు .శాతవాహనుల తొలి రాజధాని కోటి లింగాలను పర్యాటకకేంద్రంగా, ఆలయాన్ని అప్ గ్రేడ్ చేసి అభివృద్ధి చేసేం దుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

# తాగు నీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలి

**-కలెక్టర్ చిత్ర మిశ్రా**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 21 :** ఎండలు పెరుగుతు న్నందున..గ్రామాల్లో ప్రజలకు మంచి నీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ చిత్రా మిశ్రా..అధికారులను ఆదేశించారు. మంగళవారం చొప్పదండి మండలం గుమ్లాపూర్,కాట్నపల్లి పంచాయితీ పరిధి మల్లన్నపల్లి గ్రామాల్లో ఉన్న మంచినీటి బావులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, పంచాయతీరాజ్,ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.ఆయా గ్రామాల్లో జనాభా అవసరాలకు అనుగుణంగా నీటిని అందించి..నీటి సమస్య తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. ఇందుకోసం మంజూరైన ప్రభుత్వనిధులతో పెండింగ్ పనులు తక్షణమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.పైప్లైన్లలో ఎక్కడైనా లీకేజీలు ఉన్నట్లయితే వెంటనే మరమ్మతులు చేపట్టాలని,నీటి సరఫరా లో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అలాగే నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి వాటి పూర్తి వివరాలను సమర్పించాలని సం బంధిత నోడల్ అధికారులకు, ఎంపీఓ లకు సూచించారు.గ్రామాల్లో ఉన్న సింగిల్ ఫేజ్ మోటార్లు, చేతి పంపుల స్థితి,వాటి వినియోగంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కూడా ఆదేశించారు. దీర్ఘ కాలికంగా సమస్యను పరిష్కరించేందుకు శాశ్వత ప్రణాళిక రూపొందించాలని పంచాయతీరాజ్,ఆర్డబ్ల్యూఎస్, భూగర్భ గనులశాఖ అధికారులకు సూచించారు. డిపిఓ జగదీశ్వర్,ఆర్డబ్ల్యూఎస్ ఈ ఈ శ్రీనివాస్,ఏఈ,డీఈ వినయ్,ఎంపీడీవో వేణుగోపాల చారి,ఎంపీ ఓ రాజగోపాల్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఆనాటి గణిత ఉపాధ్యాయుడు

# ఉపేందర్ రెడ్డి సార్ ఇక లేరు

**(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి హుజురాబాద్)**



1980, 1990 దశకంలో హుజురాబాద్ పట్టణంలోని ప్రసిద్ధి చెందిన ప్రభుత్వ హైస్కూల్లో గణిత ఉపాధ్యాయునిగా పేరు ప్రఖ్యాతులు పొందిన పసిక ఉపేందర్ రెడ్డి (80) మంగళవారం మధ్యాహ్నం గుండెపోటు తో మృతి చెందారు.గత కొద్ది రోజులు గా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాదులో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆకస్మికంగా ఆయనకు గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు బంధువులు తెలిపారు. ఆయన మృతితో నాటి సహ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు,విద్యావంతులు, సన్ని హితులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పలువురు విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు.ఆయన సులభమైన రీతిలో విద్యార్థులు గ్రహించే విధంగా గణిత బోధన చేసేవారు. ఉపేందర్ రెడ్డి శిష్యులు దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఇప్పటికీ వారు ఉపేందర్ రెడ్డి గణిత బోధనను గుర్తు చేస్తుంటారు. ఎంతోమంది గణితంలో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులై, ఇంజనీరింగ్ తో పాటు అనేక కోర్సులు అభ్యసించి అత్యున్నత స్థానాల్లో స్థిర పడ్డారు.ఆయన విద్యార్థులను క్రమశిక్షణ తో ఉంచడంతోపాటు.. పదవి విషయం లో కఠినంగాను..తదనంతరం అందరి తో ప్రేమతో ఉండేవారు.మంచి తనం లోనూ మానవత్వంలోనూ ముందుండే వారు.ఎంతోమందికి ఆయన సహాయ సహకారాలు అందించారని తనను ఒక సోదరునిగా ఆదరించారని నాటి ఉపాధ్యాయుడు,నాటిప్రభుత్వ హైస్కూలు ప్రధానోపాధ్యాయునిగా అలాగే ఎంఈఓ గా, డిప్యూటీ డిఈవోగా పనిచేసిన ఆలేటి మదన్ మోహన్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఉపేందర్ రెడ్డి కి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉపేందర్ రెడ్డి మృతి పట్ల అన్ని బ్యాచుల పూర్వ విద్యార్థులు, హైదరాబాద్ తోషిబా కార్పొరేషన్ జనరల్ మేనేజర్ పోతిరెడ్డి శ్రీనివాస్, యూఎస్ సైంటిస్ట్ నాగమల్ల రాజేంద్రప్రసాద్ తహసిల్దార్ పోతిరెడ్డి రవీందర్, సీనియర్ పాత్రికేయుడు కోరెం సుధాకర్ రెడ్డి, గౌరిశెట్టి సోమేశ్వర్, ఇన్నార్ వైస్ ప్రెసిడెంట్ గంగిశెట్టి రాఘవేందర్, పోస్టల్ అధికారి అక్కు శ్రీనివాస్,జేపీసీ కన్వీనర్ ఆవు నూరి సమ్మయ్య,విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ పాషా,విశ్రాంత ప్రధానోపాధ్యా యులు రవి శంకర్ శుక్ల,వంగల హను మంతు,ఒంటెల రమణారెడ్డి, హైదరా బాద్ సిటీ కాలేజ్ విశ్రాంత ప్రిన్సిపల్ విప్లవదత్ శుక్ల,వరంగల్ ఎంజీఎం వైద్యులు డాక్టర్బాలాజీ,డాక్టర్ చుక్కయ్య ,విడపు రాజు,పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ కరీంనగర్ మేనేజర్ వద్దీ సాల మన్ రాజు,పంజాల కళాధర్, విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ పురమ శ్రీకాంత్,తదితరులతోపాటుఅనేక మంది ఉపేందర్ రెడ్డిమృతికి సంతాపాన్ని సానుభూతిని తెలిపారు.

# వైభవంగాశ్రీ పార్వతి కోటేశ్వరస్వామి కళ్యాణం

**-పాల్గొన్న రాష్ట్ర మంత్రి అడ్లూరి. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**







**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఏప్రిల్ 21 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల శ్రీ పార్వతి కోటేశ్వరస్వామి ఆలయంలో శంకర జయంతి పురస్కరించుకొని స్వామి వారి కళ్యాణం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ లు పాల్గొని ప్రభుత్వం తరుపున పార్వతి కోటేశ్వరస్వామి వారికి తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు.మంత్రి అడ్లూరి, ఎంపీ వంశీ లకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా వేసిన పెళ్లిమండపంలో పార్వతి పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాల ను అందంగా అలంకరించి వేదపండితుల మంత్రోశ్చరణ ల, మంగళ వాయిద్యాల మధ్య ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్క మండలాలతోపాటు సుదూర ప్రాంతాలనుండి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి కళ్యాణం తిలకించడానికి విచ్చేశారు. కళ్యాణోత్సవానికి విచ్చేసిన మంత్రి అడ్లూరి, ఎంపీ వంశీకృష్ణ లు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికోసం కృషిచేస్తామని తెలిపారు. స్వామి వారి కళ్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.